"నువ్వు నిజంగా అన్ని విధాలా అన్నిటా తృప్తి చెందావా?" నవ్వుతూ అడిగాడు తాత్త్వికుడు.

"పూర్తిగా. అన్ని విధాలా." జవాబు చెప్పాడు ఆ ధనికుడు.

"నీకు నిజంగా తృప్తే ఉంటే, ఇంకా ఈ స్థలాన్ని ఎందుకు కోరుతావు? ఇది ఇస్తే కాని నీకు తృప్తి కలగదు కాబట్టి నువ్వు నాదగ్గరకి వచ్చావు. కాబట్టి నువ్వు ఈ స్థలానికి అర్హుడవు కావు." చెప్పాడు తాత్త్వికుడు.

## 52. ఆధీనం

''స్వామీ. కూర్చుని గంటల తరబడి సాధన చేయడానికి నాకు సమయం చిక్కదు. ఏదైనా మంత్రం ఇస్తే మానసికంగా జపిస్తాను." కోరాడతను.

"అలాగే. నీకు ఒకటే మంత్రం. నీ మనసు దేన్ని కోరితే దాన్ని తిరస్కరిస్తూండు. అప్పుడు నువ్వు ఆధ్యాత్మికంగా ముందుకు వెళ్తావు." చెప్పాడు గురువు.

"ఇదేమిటి స్వామి? మీరు నాకు ఏ రామ నామ తారక మంత్రమో ఇస్తారనుకున్నాను!"

చిన్నగా నవ్వి గురువు చెప్పాడు.

"ఏ మంత్రం ఇచ్చే ఫలితమైనా మనలోని వాసనా సంస్కారాలని ప్రక్షాళనం చేసి, ఇంద్రియాలని జయించడానికే. ఇప్పుడు నేను చెప్పిన మార్గం కూడా అందుకే వుపయోగపడుతుంది. పొరుగు రాజు మీద యుద్ధం చేయాల్సి వచ్చినప్పుడు సైనికులని చూసి 'వెళ్ళి యుద్ధం చేయండి' అని ఆ రాజు ఆజ్ఞాపించగానే వాళ్ళా పని చేస్తే వాళ్ళంతా ఆ రాజు అదుపాజ్ఞలలో వున్నట్లు. అదే వాళ్ళు 'రాజా! ఇప్పుడు యుద్ధం చేయడం మంచిది కాదు. పండగలొస్తున్నాయి. తర్వాత యుద్ధానికి వెళదాం.' అని చెప్తే, రాజు 'అలాగే చేద్దాం' అంటే అప్పుడు రాజు సైనికులు చెప్పినట్లు నడుచుకుంటున్నాడు కాబట్టి వాళ్ళు రాజు ఆధీనంలో వున్నట్లు కాదు. రాజే వాళ్ళ ఆధీనంలో వున్నట్లు. స్వతంత్రుడు కాని రాజు పతనం చెందుతాడు. ఇలాగే మనసు ఇంద్రియాలని

ఫలానా విషయాల మీదకి వెళ్ళద్దని చెప్పినా అవి వెళ్తాంటే అప్పుడు ఆ మనసు స్వతంత్రురాలు కాదని అర్థం. నే చెప్పినట్లు చేస్తే అప్పుడు నీ ఇంద్రియాల మీద నీకు పట్టు వస్తుంది. ఇది ఆథ్యాత్మిక ప్రగతికి అతి ముఖ్యం."

## 53. ఇకనైనా బూట్లు తొడుక్కోండి

చలికాలంలో ఒకతను ఓ ఊరికి వెళ్ళాడు. రైల్వే స్టేషన్ నించి హోటల్‌కి చేరుకునేదాకా చూస్తే ఆ ఊళ్ళో ఎవరి పాదాలకి చెప్పులు కాని, బూట్లు కాని లేకపోవడం అతను గమనించాడు. హోటల్ రిసెప్షనిస్టుకి, కేషియర్‌కి, బెల్ బాయెస్‌కి కూడా బూట్లు లేవు.

మర్నాడు అతను హోటల్ నించి బయటకి వచ్చి చూస్తే మంచు కురిసి ఉంది. కాని రోడ్డు మీద తిరిగే ఎవరి పాదాలకి బూట్లు లేవు. అతను ఒకతన్ని ఆపి అడిగాడు.

"మీకెవరికీ బూట్ల గురించి తెలీదా?"

"ఎందుకు తెలీదు? తెలుసు." జవాబు చెప్పాడు అతను.

"ఇక్కడికి బూట్లు సరఫరా కావా?" మళ్ళీ ప్రశ్నించాడు అతను ఆసక్తిగా.

"ఎందుకు కావు? అదిగో. ఎదురుగా కనబడే ఆ బిల్డింగ్‌లోనే బూట్లు తయారవుతూంటాయి." ఓ పెద్ద భవంతిని చూపించి చెప్పాడు అతను.

"ఈ ఊళ్ళో బూట్లు బాగా ఖరీదా?"

"ఊహు. ఇక్కడే తయారవుతాయి కాబట్టి చవకే."

"అవి మీకు చలి నించి రక్షణ ఇస్తాయని తెలీదా?"

"తెలుసు."

"మరి మీరంతా ఎందుకు బూట్లని వేసుకోరు?"

"ఏమో మరి? మేం ఎందుకు బూట్లని వేసుకోమో నాకు తెలీదు." జవాబు చెప్పాడు అతను.

ప్రార్థన విషయంలో కూడా మనలో చాలామంది పై ఊళ్ళోని బూట్లు వాడని ప్రజల్లాంటి వారే. వారు ఆస్తికులా అంటే కాదు. ప్రార్థన గురించి,